

రూ.40కోట్లకు కుచ్చుటోపీ

రైతులకు వేరుశనగ డబ్బులు చెల్లించకుండా ఓ వ్యాపారి కుచ్చుటోపీ పెట్టాడు.

వివరాలు 8లో ▸



జూరాలకు ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు 1,29,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 30.2 /24.1

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు

కోస్గి: ఎలాంటి రసాయనిక ఎరువులు వినియోగించకుండా ఆవు పేడ, ఆవు మూత్రం, వివిధ రకాల సహజ సిద్ధమైన కొన్ని రకాల ఆకులతో తయారు చేసే రసాయన మందులు వినియోగించి చేసే ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులతోపాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అనంతపూర్ జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయ శిక్షకులు నాగరాజు సూచించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఏబీకే ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ప్రస్తుత సమాజంలో ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను రైతులకు సమగ్రంగా వివరించారు. ప్రస్తుతం లభిస్తున్న వస్తువులు అన్ని కల్తీమయంగా మారి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని, ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించుకొని తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులతోపాటు పలువురు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



నారాయణపేట రూరల్ : ప్రతి ఒక్కరు ఏడాదిలో రెండు సార్లు రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త రక్తం చేరి ఆరోగ్యంగా ఉంటామని.. రక్తదానం ప్రాణదానంతో సమానమని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్నేహ మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీసాయి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని, రక్తం ఇవ్వడం వల్ల ఏదో కోల్పోతామనే ఆలోచనల్లో ఉన్న ప్రజలను చైతన్య పర్చాలన్నారు. ఒకరి రక్తం మరొకరికి ప్రాణదానం చేసినంత పుణ్యం లభిస్తుందన్నారు. అత్యవసర సమయంలో బ్లడ్‌బ్యాంకుల్లో రక్తం నిల్వ ఉండటానికి ముందస్తుగా రక్తదానం చేయాలన్నారు. మొత్తం 21యూనిట్ల రక్తం ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకుకు అందించినట్లు డాక్టర్ మధన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అంతకుముందు ఆలయంలో సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మిత్రమండలి అధ్యక్షులు మధన్‌మోహన్‌రెడ్డి, వెంకట్రాములు, తరుణ్, వెంకటయ్య, రామ్, ఆలయ కమిటి సభ్యులు జయంత్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, సుభాష్, సతీష్ పాల్గొన్నారు.

■ 'ఈ ఫొటోలో కోస్గి మున్సిపల్ కమిషనర్ నిబంధనలు పాటించని వ్యాపారులకు జరిమానా విధిస్తున్నారు. ఈ నెల 3న మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ రైడ్ పేరుతో పట్టణంలోని పలు వ్యాపార దుకాణాలపై ఆకస్మిక దాడులు చేశారు. అధికారుల ఆదేశాలను లెక్క చేయకుండా నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న పలువురు దుకాణ యజమానులకు జరిమానాలు విధించారు. నిబంధనల మేరకు 120 మైక్రాన్‌ల కన్న తక్కువ మందం ఉన్న కవర్లను వాడుతున్న యజమానులకు నోటీసులు జారీ చేయడంతోపాటు రెండు గంటల వ్యవధిలోనే పలు దుకాణాల నుంచి రూ.11000 జరిమానా వసూలు చేశారు. ఒకేరోజు గంటల వ్యవధిలోనే రూ. 11000 జరిమానా వసూలు చేశారంటే ప్లాస్టిక్ వినియోగం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతుంది.' ఇప్పటికైన అధికార యంత్రాంగం నామమాత్రపు తనిఖీలు **కాకుండా ప్లాస్టిక్ వినియోగం పట్ల కఠినంగా వ్యవహరించాలని పలువురు కోరుతున్నారు.'**



నిబంధనలు బేఖాతరు

యథేచ్ఛగా పట్టణాల్లో ప్లాస్టిక్ కవర్ల వినియోగం



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)

- నిషేధానికి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు
- పట్టణాల్లో తూతూ మంత్రంగా అధికారుల దాడులు..జరిమానాలు
- జిల్లాలోని మున్సిపాలిటీల్లో రోజు 8 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వినియోగం

కోస్గి: నిబంధనలకు మేరకు ప్రభుత్వం సూచించిన ప్రమాణాలకు లోబడి తయారు చేసిన ప్లాస్టిక్‌ను మాత్రమే వినియోగించాలని, ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్‌ను వ్యాపారులు విక్రయించిన, ప్రజలు వినియోగించిన భారీగా జరిమానాలు విధించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికి ఆశించిన స్థాయిలో కట్టడి చేయకపోవడంతో పట్టణాల్లో ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోతుంది. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ బ్యాగుల వినియోగానికి సంబంధించి పుర పాలక శాఖ కఠిన ఆంక్షలు అమలు చేయాలని, ప్లాస్టిక్‌ను శాశ్వతంగా నిషేదించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలనే ఆదేశాలు ఉన్నప్పటికి స్థానిక పరిస్థితుల నేపథ్యంలో ఆదేశాలు అమలు కావడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి మున్సిపాలిటీల పరిధిలో వ్యాపార సంస్థలు, గృహ సముదాయాల నుంచి రోజు 41 మెట్రిక్ టన్నుల చెత్త, 8 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ జరుగుతుందంటే ప్లాస్టిక్ వినియోగం ఏ మేర ఉందో అర్థమవుతుంది.

రాజకీయ ఒత్తిళ్లు తగ్గితేనే సంపూర్ణ నిషేధం

ప్లాస్టిక్ కవర్లు, వస్తువులపై నిషేదానికి ఉమ్మడి రాష్ట్రంలో 2013 జూన్ 20న జీఓ అమల్లోకి వచ్చింది. అప్పట్లో మున్సిపాలిటీలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనార్థలపై ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. మున్సిపాలిటీల్లోని పారిశుధ్య విభాగం అధికారుల బృందాలు ఆకస్మిక దాడులు చేసి వ్యాపారులకు జరిమానాలు సైతం విధించారు. రాజకీయ ఒత్తిలు రావడంతో అధికారులు ఆశించిన ఫలితాలు సాధించలేకపోయారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక 2016 డిసెంబర్ 30న మళ్లీ జీఓ 79 అమలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. మున్సిపాలిటీల్లో ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, ప్లేట్లు విక్రయించే హోల్‌సెల్ వ్యాపారులపై అధికారులు ఆకస్మిక దాడులు చేసి పెద్ద మొత్తంలో ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని రూ.లక్షల్లో జరిమానాలు విధించారు. మళ్లీ రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అధికారులు అరకొర దాడులతో అయ్యిందనిపించారు. ఏ వ్యాపారి దగ్గరకు వెళ్లిన ఎవరో ఒక లీడర్ ఫోన్ చేయడంతో అధికారులు సైతం చూసిచూడనట్లు వ్యవహరించడంతోపాటు ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా జరుగుతుంది. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు వెనకడుగు వేస్తున్నారని, రాజకీయ ఒత్తిళ్లు తగ్గితేనే సంపూర్ణ ప్లాస్టిక్ నిషేదం సాధ్యమని పర్యవరణ రక్షకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రోజువారీ సేకరిస్తున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు (మెట్రిక్ టన్నుల్లో)

మున్సిపాలిటీ	మొత్తం ఇళ్లు	వ్యాపార సముదాయాలు	చెత్త	ప్లాస్టిక్
నారాయణపేట	8798	663	19	4
కోస్గి	3200	520	11	2
మక్తల్	6980	350	11	2

జరిమానా విధిస్తున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్లాస్టిక్ నిషేదానికి మొదట కర పత్రాలు పంచడం, ప్రత్యేక సమావేశాల్లో వ్యాపారులకు, అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కల్పించే చర్యలు తీసుకున్నాం. పట్టణాల్లో ఆకస్మికదాడులు చేసి జరిమానాలు విధిస్తున్నాం. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తగ్గకుండా కఠినంగా వ్యవహరించి ప్లాస్టిక్ నిషేదానికి చర్యలు తీసుకుంటాం. అవసరమైతే నిబంధనలు ఉల్లంగించిన వారిపై కేసులకు సైతం సిద్ధంగా ఉన్నాం.

– శ్రీధర్, మున్సిపల్ కమిషనర్, కోస్గి

వ్యాపారులు సహకరించాలి..



ప్రభుత్వం ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్న నేపథ్యంలో వ్యాపారులు సైతం స్వచ్ఛందంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేదించి అధికారులకు సహకరించాలి. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించి ప్రజలు సైతం ప్లాస్టిక్‌ను ఎట్టి పరిస్థితుల్లో వాడబోమని సంకల్పించుకోవాలి. అందరి సహకారం ఉంటేనే ప్లాస్టిక్ నిషేధం సాధ్యమవుతుంది.

– కోడిగంటి అన్నపూర్ణ, మున్సిపల్ చైర్ పర్సన్, కోస్గి



కోస్గి శివారులో చెన్నారం రోడ్డులో పారవేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

దశల వారీగా నిషేధానికి కార్యాచరణ

ప్లాస్టిక్ వినియోగానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం దశల వారీగా ప్లాస్టిక్ నిషేదానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. మున్సిపాలిటీలు, పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేదానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు 50 మైక్రాన్ల కంటే తక్కువ పరిణామం కలిగిన ప్లాస్టిక్ కవర్లను నిషేదించారు. 2022 సెప్టెంబర్ 1 నుంచి 75 మైక్రాన్లలోపు ఉన్న కవర్లను నిషేదించారు. 2022 డిసెంబర్ 31 నుంచి 75 నుంచి 125 మైక్రాన్లకు పెంచి దశల వారిగా నిషేదించినప్పటికి కాగితాల్లోనే నిషేదం కనిపిస్తున్నా క్షేత్రస్థాయిలో ప్లాస్టిక్ వినియోగం యథావిధిగా కొనసాగుతుంది. ఇప్పటికైన అధికారులు కఠిన చర్యలు తీసుకొని ప్లాస్టిక్‌ను పూర్తిగా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

రేపు మక్తల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్

సాక్షి ఫోన్ ఇన్

వానాకాలంలో డెంగీ, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో మంగళవారం మక్తల్ మున్సిపల్ కమిషనర్ బోగేశ్వర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. పురపాలిక పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్య చర్యలపై ప్రజలు సలహాలు, సూచనలు ఇవ్వవచ్చు. అలాగే ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం నిండిపోవడం, డ్రెయినేజీ, రోడ్లు సరిగా లేకపోవడం తదితర సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు. వాటి పరిష్కారం కోసం కమిషనర్ సమాధానమిస్తారు.



బోగేశ్వర్, మున్సిపల్ కమిషనర్, మక్తల్

తేదీ : 23.7.2024 సమయం : ఉదయం 11 నుంచి 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ : 8143174944

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



మక్తల్‌లో షిరిడీ సాయి ఆలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రత్యేక పూజలు

- మార్మోగిన సాయినామస్మరణ
- పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మక్తల్: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని ఆలయాలు ప్రత్యేక పూజలు, భక్తులతో కిటకిటలాడాయి. మక్తల్ పడమటి ఆంజనేయస్వామి, మల్లికార్జున స్వామి, సత్యసాయి భగువాన్, షర్డిసాయి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మల్లికార్జున స్వామి ఆలయంలో రైతులు పూజారి తిప్పయ్య స్వామి గురువుకు సన్మానం, తులాభారం చేశారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నాయకుడు కొండయ్య, గణేస్‌కుమార్,ఆనంద్‌గౌడ్, అనిల్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే, మంతన్‌గౌడ్ గ్రామంలో దత్తాత్రేయ ఆలయంలోను స్వామి వారికి భక్తులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

కోస్గిలో సాయినాథునికి 108 కలశాలతో క్షీరాభిషేకం

కోస్గి: గురుపౌర్ణమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీలక్ష్మీ వెంకటేశ్వర శివసాయి అయ్యప్ప దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సాయి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని రామాలయం ఆంజనేయ స్వామి ఆలయం నుంచి సాయి బాబా ఆలయం వరకు సాయి సేవాదల్, సత్య సాయి సమితి ఆధ్వర్యంలో మహిళలు 108 కలశాలతో రామాలయం చౌరస్తా మీదుగా భజన సంకీర్తనలు ఆలపిస్తూ సాయి మందిరం వరకు ఊరేగింపు నిర్వహించారు. బాబా విగ్రహానికి 108 కలశాలతో క్షీరాభిషేకంతోపాటు అష్టోత్తరం, మధ్యాహ్న హారతి నిర్వహించారు. తీర్థప్రసాదాల వితరణతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దూపాహారతి, పల్లకి సేవ, తీర్థహారతి కార్యక్రమాలలో మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



కోస్గిలో సాయిబాబా ఆలయంలో..

మెడికల్ కళాశాల పనులు త్వరగా పూర్తి చేయాలి



మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: మండలంలోని అప్పక్ పల్లి గ్రామ సమీపంలోని నూతన ప్రభుత్వ వైద్య కళాశాలను ఆదివారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. వైద్య కళాశాల భవన సముదాయాన్ని పరిశీలించిన కలెక్టర్ చివరి దశ పనులను రెండు రోజులలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాలలో ప్రిన్సిపల్ గది, ఎగ్జామినేషన్ హాల్, లెక్చర్ రూమ్, వివిధ ల్యాబ్‌లను పరిశీలించారు. ప్రిన్సిపల్ గదితో పాటు, తరగతుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన విశాలమైన గదులలో అవసరమైన ఫర్నిచర్, ఇతర వసతి సౌకర్యాలపై మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాల ఆవరణ చుట్టూ పెద్ద పెద్ద మొక్కలను నాటాలని సూచించారు. ఆస్పత్రి నిర్మాణ నమూనా చిత్రాన్ని పరిశీలించి చివరి దశ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

విద్యారంగంపై చిన్నచూపు తగదు..



పదోన్నతి పొందిన వారిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైద్రాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి విమర్శించారు. నారాయణపేట జిల్లా స్థాయిలో ఇటీవల పదోన్నతులు పొందిన జీహెచ్‌ఎం, ఎస్‌ఏ, పీఎస్‌హెచ్‌ఎంలకు తపస్ ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టడాన్ని స్వాగతిస్తున్నా, నారాయణపేట లాంటి ప్రాంతాల్లో బదిలీ అయిన ఎస్‌జీటీ టీచర్లకు స్థానచలనం కల్పించకపోవడం సరికాదన్నారు. వెంటనే వారిని కొత్త స్థానాలకు పంపించి అవసరమైన మేర సర్దుబాటు చేయాలని, వలంటీర్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ అనుమతి పొందాలని సూచించారు. పదోన్నతుల ప్రక్రియలో మిగిలిపోయిన వాటిని వెంటనే తదుపరి సీనియర్ టీచర్లతో భర్తీ చేయాలన్నారు. రాబోవు బడ్జెట్‌లో విద్యారంగానికి సింహభాగం నిధులు కేటాయించి చదువు పట్ల రేవంత్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. 317జీఓ బాధితులకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామన్నారు.

ఖాళీలతో విద్యాబోధన సాగేదెలా..?

ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న ఖాళీలతో విద్యాబోధన ఎలా సాగుతుందని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు ప్రశ్నించారు. ఎస్‌జీటీ టీచర్ల బదిలీలకు సంబంధించిన ప్రక్రియ ముందుకు సాగాలని, అవసరమైన చోట వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బీఈడీ అర్హత కల్గిన టీచర్లకు పీఎస్‌హెచ్‌ఎంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బకాయి డీఏలు, కొత్త పీఆర్‌సీని వెంటనే ప్రకటించకపోతే రాష్ట్ర స్థాయి ఆందోళనకు దిగుతున్నట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి కిశోర్, నాయకులు గుంపుబాలరాజు, మల్లికార్జున్, నర్సప్ప, జ్యోతి, అపర్ణ, రవికుమార్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

నారాయణపేట: ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలమణి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు, పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించే ఆశా కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ ఏడాది 4 టీఎంసీల నీటి ఎత్తిపోతలకు సన్నద్ధం

- ఎల్లూరు పంపుహౌస్‌లో రెండు పంపుల ఏర్పాటు పూర్తి
- మరో నాలుగు పంపుల బిగింపునకు కొనసాగుతున్న పనులు
- నిబంధనల మేరకు నీటి ఎత్తిపోతలకు అధికారుల సన్నద్ధం
- ఉన్నతాధికారుల ఆదేశాల కోసం ఎదురుచూపులు

శరవేగంగా 'పాలమూరు'



పాలమూరు ఎత్తిపోతల పథకంలోని ఎల్లూరు పంపుహౌస్

కొల్లాపూర్: ఉమ్మడి పాలమూరుతోపాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు సాగు, తాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో వేగం పెరిగింది. మొదట్లో రాష్ట్రంలో ఎన్నికలు రావడం.. ప్రభుత్వాలు మారడం.. నిధుల విడుదలలో జాప్యం కారణంగా పనుల్లో వేగం నెమ్మదించింది. తాజాగా ప్రాజెక్టు పనులపై ప్రస్తుతం పాలక ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించడంతో ఊపందుకున్నాయి.

ఎల్లూరు పంపుహౌస్‌లో..

ప్రాజెక్టు ప్రారంభం నాటికి ఒక్క ఎల్లూరు పంపుహౌస్‌లో రెండు మోటార్లను బిగించారు. వీటిలో ఒక మోటారుకు మాత్రమే విద్యుత్ సరఫరా, చార్జింగ్ వంటి ప్రక్రియలు పూర్తిచేసి, నీటి ఎత్తిపోతలు చేపట్టారు. ఆ తర్వాత రెండో మోటారు ఏర్పాటు పనులు కూడా పూర్తిచేశారు. గతేడాది నవంబర్‌లో మూడో మోటారు బిగింపు పనులు ప్రారంభించారు. ఇటీవలి కాలంలో నాలుగో మోటారు బిగింపు సైతం పూర్తయింది. ఎల్లూరు లిఫ్ట్ వద్ద మొత్తం 8 మోటార్లకు గాను ఇప్పటి వరకు నాలుగు మోటార్లు బిగించారు. రెండు మోటార్లకు సంబంధించిన పనులన్నీ పూర్తయ్యాయి. మిగిలిన రెండు మోటార్లకు విద్యుత్ కనెక్షన్, కేబుల్ కనెక్షన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసే డెలివరీ మెయిన్స్ పనులు చేపడుతుండగా.. నాలుగు డెలివరీ పంప్‌లకు సంబంధించిన పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం విద్యుత్, మెకానికల్ వర్క్స్ మాత్రమే చేపడుతున్నారు.

ఉన్నత స్థాయిలో సమీక్షలు..

రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్షలు జరిగాయి. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆయా ప్రాజెక్టులపై ఉన్నతాధికారులతో చర్చించారు. 2024- 25 బడ్జెట్‌లో పాలమూరు ఎత్తిపోతల కోసం రూ.2,500 కోట్లు కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటి వరకు రూ.31,424 కోట్ల పనులు పాలమూరు ప్రాజెక్టులో జరిగాయి. మరో రూ.21 వేల కోట్లు ఖర్చు చేస్తే, పనులు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

అధికారికంగా అందని ఉత్తర్వులు..

పాలమూరు ప్రాజెక్టుతో సాగునీటి ఎత్తిపోతలకు గతేడాది నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి అనుమతులు లభించాయి. అయితే వాటికి సంబంధించిన పూర్తిస్థాయి ఉత్తర్వులు ఇంకా అధికారికంగా అందకపోవడంతో ప్రస్తుతం తాగునీటి అవసరాల కోసమే పనులు కొనసాగుతున్నాయి. ఇందుకోసం మూడు విడతల్లో పనులు పూర్తిచేయాలని నిర్ణయించారు. మొదటి దశలో భాగంగా ఒక పంపు ద్వారా 2 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. ఈ ఏడాది రెండో మోటార్ ద్వారా కూడా నిర్ణీత మొత్తంలో ఎత్తిపోతలు సాగనున్నాయి. సాగునీటి విడుదలకు కేంద్రం నుంచి అనుమతులు లభిస్తే ఎత్తిపోతల స్థాయి పెరిగే అవకాశం ఉంది.

సివిల్, కాంక్రీట్ వర్క్స్..



పాలమూరు ఎత్తిపోతల పథకం పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సివిల్, కాంక్రీట్ వర్క్స్ పూర్తయ్యాయి. ఎల్లూరు లిఫ్టులో రెండు మోటార్ల బిగింపు పూర్తయింది. మూడో మోటారు బిగింపు పది రోజుల్లో పూర్తవుతుంది. నాలుగో మోటారు బిగింపు పనులు కూడా కొనసాగుతున్నాయి. ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు చేపడుతున్నాం. నాలుగు డెలివరీ సిస్టమ్స్ పనులు పూర్తయ్యాయి. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే 4 టీఎంసీల నీటి ఎత్తిపోతలకు సిద్ధంగా ఉన్నాం.

– శ్రీనివాసరెడ్డి, ఈఈ, నీటిపారుదల శాఖ

ఎత్తిపోతలకు సన్నద్ధం..

నిబంధనల ప్రకారం పాలమూరు ఎత్తిపోతల పథకం ప్రారంభమైన తొలి ఏడాది 2 టీఎంసీల నీటిని కృష్ణానది నుంచి తాగునీటి అవసరాల కోసం ఎత్తిపోయాల్సి ఉంది. రెండో ఏడాది 2 టీఎంసీల నీరు, మూడో ఏడాది 6 టీఎంసీల నీటిని వినియోగించుకోవాలి. నిబంధనల మేరకు ఈ ఏడాది 4 టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కృష్ణానదికి వరద జలాలు వస్తుండటంతో రెండు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వస్తే, వారం రోజుల్లో నీటి ఎత్తిపోతలు పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నారు. నార్లాపూర్ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 6.04 టీఎంసీలు కాగా.. ఇప్పటి వరకు 90 శాతం మేర నిర్మాణ పనులను పూర్తిచేశారు. 4 టీఎంసీల నీటి నిల్వకు రిజర్వాయర్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు.



నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద డెలివరీ పంపులు

క్లుప్తంగా

కళాశాల యాజమాన్యం వేధింపులు

● విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

అచ్చంపేట రూరల్: ప్రైవేట్ కళాశాల యాజమాన్యం వేధింపులు భరించలేని మండలంలోని చేదురుబావితండాకు చెందిన గిరిజన విద్యార్థిని హైదరాబాద్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. హరీష్‌నాయక్, అనూష దంపతుల మొదటి కుమార్తె వేణుశ్రీ మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం పరిధిలోని హరిపురికాలనీలోని కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఈమె ప్రథమ సంవత్సరంలో 432/440 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరంలోనూ అదే తరహా మార్కులు రావాలని విద్యార్థినిపై యాజమాన్యం ఒత్తిడి పెంచిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. శనివారం తాను ఉంటున్న హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించి తోటి విద్యార్థినులు కళాశాల యాజమాన్యానికి సమాచారం అందించగా, ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని తెలిసింది. ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. కాగా ఆదివారం కళాశాల యాజమాన్యం వేధింపుల వల్లే తమ కూతురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆరోపిస్తూ కళాశాల సమీపంలోని రహదారిపై విద్యార్థి బంధువులు, కుల సంఘాల నాయకులతో కలిసి ధర్నా చేశారు. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు. ఉరేసుకున్నట్లు ఆనవాలు కన్పించడం లేదని విద్యార్థిని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుర్తుతెలియని మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లిలో గుర్తుతెలియని మహిళ (50) మృతిచెందింది. రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్ వివరాల మేరకు.. బండమీదిపల్లి ప్రాంతంలో నిత్యం భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తుతెలియని మహిళ ఆదివారం స్థానిక శిశుమందిర్ సమీపంలో రోడ్డు పక్కన కిందపడి మృతిచెందింది. ముసురువాన, చల్లని గాలులకు తాళలేక మృతిచెంది ఉండవచ్చని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆదివారం లభ్యమైంది. ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని 40ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి ఆర్టీసీ బస్టాండ్ లో మృతి చెంది ఉండగా, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆర్టీసీ కంట్రోలర్ సురేందర్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

గొడ్డలితో వ్యక్తిపై దాడి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: భూ తగాద విషయంలో గొడ్డలితో వ్యక్తిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తూడుకుర్తిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం తూడుకుర్తికి చెందిన నాగ శేషు, కృష్ణయ్యలకు చాలా కాలంగా భూ తగాదాలు ఉన్నాయి. నాగశేషు శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద ఉండగా అతని అన్న కృష్ణయ్య కుమారుడు రాంబాబు పొలం వద్దకు వచ్చి గొడ్డలితో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు నాగర్‌కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులో తీసుకెళ్లారు. ప్రస్తుతం బాధితుడు నాగశేషు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనకు సంబంధించి ఆదివారం ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీలో డీజిల్ చోరీ: పోలీసులకు ఫిర్యాదు

వెల్దండ: వెల్దండ మండల పరిధిలోని రాఘయపల్లిలో గోలి సుధాకర్‌రెడ్డికి చెందిన లారీలో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ చోరీకి పాల్పడినట్లు బాధితుడు ఆదివారం వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సుధాకర్‌రెడ్డి లారీని నడిపిస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. రోజువారీగా శనివారం రాత్రి ఇంటి సమీపంలో లారీని నిలిపాడు. అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి లారీ డీజిల్ ట్యాంక్ తాళం ధ్వంసం చేసి అందులోని 200 లీటర్ల డీజిల్ చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం లారీ యజమాని లారీ వద్దకు వెళ్లి చూడగా.. లారీలోని డీజిల్‌ను చోరీ చేసినట్లు గుర్తించాడు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా.. కారులో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి డీజిల్‌ను తీసుకెళ్లినట్లు కనిపించింది. ఈ విషయంపై వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

రూ.40కోట్లకు కుచ్చుటోపీ

- వేరుశనగ డబ్బు ఇవ్వకుండా ఉడాయించిన షోలాపూర్ వ్యాపారి
- ఏళ్లుగా వ్యాపారులు, రైతులతో ధాన్యం కొనుగోలు
- నాలుగు నెలలుగా అందుబాటులోకి రానివైనం
- ఆందోళనలో గద్వాల, జడ్చర్ల, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ వ్యాపారులు
- గద్వాల గంజి వ్యాపారులకు రూ.4.50కోట్ల వరకు లావాదేవీలు
- రైతులకు అందాల్సింది రూ.కోటికి పైగా..



గద్వాల వ్యవసాయ మార్కెట్‌యార్డు

గద్వాల రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు.. రైతుల నుంచి వేరుశనగ ధాన్యం కొనుగోలు చేసి వారికి డబ్బులు చెల్లించకుండా సుమారు రూ.40కోట్లకు కుచ్చుటోపీ పెట్టాడో షోలాపూర్ వ్యాపారి. బాధితులంతా గద్వాలతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వారు కావడం చర్చనీయాంశమైంది. గద్వాల వ్యవసాయ మార్కెట్‌లో కమీషన్‌దారులుగా ఉంటూ వ్యాపారం నిర్వహించే పలువురు వ్యాపారులు రైతుల వద్ద సుమారు రూ.4.50కోట్ల వేరుశనగ పంటను కొనుగోలు చేసి దానిని మహారాష్ట్రకు చెందిన వ్యాపారికి విక్రయించారు. నాలుగు నెలలుగా సదరు మహారాష్ట్రకు చెందిన వ్యాపారి డబ్బులు ఇవ్వకుండా అందుబాటులో లేకుండా పోవడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు.

రైతులకు రూ.కోటి వరకు..

గంజి వ్యాపారులైన కమీషన్‌దారుల పరిస్థితి ఇలా ఉంటే ఆరుగాలం శ్రమించి పండించిన రైతులకు సుమారు రూ. కోటి వరకు డబ్బులు చెల్లించాల్సి ఉందని సమాచారం. పంటను విక్రయించిన సదరు రైతులు కమీషన్‌దారులైన వ్యాపారుల వద్ద నిత్యం తిరిగి వెళ్తున్నట్లు తెలిసింది. అయితే సదరు కమీషన్‌దారులు మాత్రం ఇప్పుడు, అప్పుడంటూ రైతులకు నచ్చచెబుతూ పంపిస్తున్నారు. ఈ వ్యవహారం గద్వాల వరకే పరిమితం కాక.. ఉమ్మడి జిల్లాలోని జడ్చర్ల, వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లో కూడ ఇదే తరహా పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం.

వడ్డీ వ్యాపారుల ఒత్తిడి

వడ్డీ వ్యాపారానికి గద్వాల పెట్టింది పేరు. పలువురు ప్రైవేటు వ్యక్తులు డబ్బులను గంజిలో కమీషన్‌దారులుగా వ్యాపారం నిర్వహించే పలువురు వ్యక్తులకు వడ్డీలకు ఇస్తూ వడ్డీవ్యాపారం చేస్తారు. ప్రతినెలా ఖచ్చితంగా వడ్డీ చెల్లించాలన్నది నిబంధన. అయితే గత రెండు నెలలుగా చెల్లించాల్సిన వడ్డీ డబ్బులను కమీషన్‌దారులైన వ్యాపారులు చెల్లించకపోవడంతో వారిపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు తెలిసింది. డబ్బులు ఇవ్వని పక్షంలో తీసుకున్న అప్పుకు సరిపడా ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించాలంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం.

> **ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతాం..**
>
> వేరుశనగ వ్యాపారి ధాన్యం డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయాడనే విషయమై ఇప్పటివరకు గద్వాల వ్యవసాయ మార్కెట్‌యార్డుకు సంబంధించి వ్యాపారులు, మరెవరూ ఫిర్యాదు చేయలేదు. ఎవరైన బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
>
> – శ్రీనివాసులు, ఎస్ఐ, గద్వాల టౌన్

అందరూ మార్కెట్‌యార్డు వ్యాపారులే..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో గద్వాల, వనపర్తి, జడ్చర్ల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో కమీషన్ మీద రైతుల వద్ద పలు పంట ఉత్పత్తులు కొనుగోలు చేసి వ్యాపారం చేస్తున్నారు. ఈ సీజన్‌లో పండించిన వేరుశనగ పంటను రైతులు విక్రయించేందుకు గద్వాల వ్యవసాయ మార్కెట్‌యార్డు(గంజి)కు తీసుకొచ్చారు. ఇలా సుమారు రూ.4.50కోట్ల మేర వేరుశనగ పంటకు సంబంధించి క్రయవిక్రయాలు జరిగాయి. వీటిని కొనుగోలు చేసిన కమీషన్‌దారులైన వ్యాపారులు 20 ఏళ్లుగా వ్యాపార లావాదేవీలు కొనసాగించే మహారాష్ట్రం షోలాపూర్‌కు చెందిన ఓ వ్యాపారికి విక్రయించారు. సాధారణంగా వ్యాపార లావాదేవీలకు సంబంధించిన డబ్బులు సదరు షోలాపూర్ వ్యాపారి 10–15రోజుల వ్యవధిలో చెల్లిస్తూ వస్తున్నారు. అయితే ఈ ఏడాది కొనుగోలుచేసిన సుమారు రూ.4.50కోట్ల వేరుశనగ పంటకు సంబంధించి డబ్బులు రెండు నెలలు గడచిపోయినా ఇవ్వకపోవడంతో కమీషన్‌దారులైన వ్యాపారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సదరు వ్యాపారిని కలిసి నేరుగా అడుగుదామని షోలాపూర్‌కు వెళ్లగా అందుబాటులో లేకుండా పోయాడు. ఇదిలా ఉండగా, సదరు షోలాపూర్ వ్యాపారి గద్వాల వ్యవసాయ మార్కెట్‌యార్డులోని కమీషన్‌దారులతోనే కాకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జడ్చర్ల, వనపర్తి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌లోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు చెందిన పలువురు కమీషన్‌దారులైన వ్యాపారులతో ఇదే తరహాలో వేరుశనగ పంటను కొనుగోలు చేసి సుమారు రూ.35కోట్లకు కుచ్చుటోపీ పెట్టినట్లు సమాచారం. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేయాలి.. ఎలా ముందుకు వెళ్లాలి అనేదానిపై సదరు కమీషన్‌దారులైన వ్యాపారులు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది.

జూరాలకు 1.29 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


శ్రీశైలం వైపు పరవళ్లు తొక్కుతున్న వరద నీరు

- ప్రాజెక్టులో 27 క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూర్/ ఆత్మకూర్/ దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం రాత్రి 8.30 గంటల వరకు ప్రాజెక్టుకు 1,11,000 క్యూసెక్కుల రాగా.. రాత్రి 10 గంటల సమయానికి 1,29,000 క్యూసెక్కులకు చేరిందని పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టులోని 27 క్రస్టు గేట్లను ఎత్తి 1,03,754 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో విద్యుదుత్పత్తి కోసం 30,407 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 1,300, లిఫ్టు–2కు 750, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 1,500, ఆవిరి రూపంలో 42, కుడి కాల్వకు 870, ఎడమ కాల్వకు 596, సమాంతర కాల్వకు 300 క్యూసెక్కులు కలిపి మొత్తం 1,38,483 క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలానికి వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 6.805 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

⇨ ఎగువనున్న ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో భారీగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 1,23,445 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. దిగువకు 1,35,000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 123.081 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 95.890 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దీంతో ప్రాజెక్టు వద్ద 25 గేట్లు ఎత్తి 1,45,750 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 33.31 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 28.492 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలానికి 1.14 లక్షల క్యూసెక్కులు

శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి 1,14,645 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుంది. ప్రస్తుతం జలాశయంలో 822.5 అడుగుల వద్ద 42.7386 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో స్థానికంగా 2.80 మి.మీ.,ల వర్షపాతం నమోదైంది. అలాగే జలాశయంలో 63 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

ముమ్మరంగా విద్యుదుత్పత్తి

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి ముమ్మరంగా కొనసాగుతుందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపడుతున్నారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో కలిపి ఇప్పటి వరకు 21.720 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని చెప్పారు.

భర్త, పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు : కేసు నమోదు

అడ్డాకుల: భర్త, ముగ్గురు పిల్లలు కనిపించకుండా పోయారని భార్య ఫిర్యాదు చేసినట్లు మూసాపేట ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మూసాపేట మండలంలోని వేములకు చెందిన ఎం.భీమేష్‌కు 9ఏళ్ల క్రితం అరుణతో వివాహం కాగా వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్ల నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా నెల క్రితం భార్య తన తల్లిదండ్రులు నివాసముండే హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో ఉంటున్న భార్య వద్ద ఉన్న ముగ్గురు పిల్లలను ఇటీవల వేములకు తీసుకొచ్చాడు. అయితే శనివారం భీమేష్‌తో పాటు ముగ్గురు పిల్లలు వేముల నుంచి ఎక్కడికో వెళ్లిపోవడంతో బంధువులు భార్యకు సమాచారం ఇచ్చారు. ఆమెతో పాటు బంధువులు వెతికినా ఆచూకీ కనిపించకపోవడంతో తన భర్త, పిల్లలు కనిపించడం లేదని ఆదివారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం


శంకరసముద్రం రిజర్వాయర్ కుడి కాల్వలో గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట రూరల్: అసంపూర్తిగా ఉన్న కానాయపల్లి శంకరసముద్రం రిజర్వాయర్ పనులను త్వరలోనే పూర్తిచేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని శంకరసముద్రం రిజర్వాయర్ కుడి కాల్వ ద్వారా నిర్వేన్, పాలెం, రామనంతాపురం గ్రామాల రైతులకు సాగునీరు అందించేందుకు ఏర్పాటుచేసిన మోటార్లను ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి గంగమ్మకు పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా శంకరసముద్రం రిజర్వాయర్ పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందకపోవడం, పునరావాస కేంద్రంలో సరైన మౌలిక వసతులు కల్పించకపోవడంతో కానాయపల్లి గ్రామస్తులు గ్రామాన్ని ఖాళీ చేయలేదని.. ఫలితంగా శంకరసముద్రం రిజర్వాయర్ గ్రావిటీ ద్వారా సాగునీరు అందించడం సాధ్యం కావడం లేదన్నారు. గ్రామస్తుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, మైబు, కిరణ్, కోటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రమణ, పెంటన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

గురువు ఆశీర్వాదం గొప్పది

- గురుభక్తి చాటుకున్న ఎంపీ డీకే అరుణ


చిన్ననాటి గురువును సన్మానిస్తున్న ఎంపీ డీకే అరుణ

నారాయణపేట రూరల్: రాజకీయంగా ఎదగడానికి పుట్టినింట్లో తన తండ్రి, మెట్టినింట్లో భర్త, మామలు కారణమైనా.. అందుకు అడుగులు వేయడానికి అవసరమైన అక్షరజ్ఞానం నేర్పించింది పాఠశాలలో గురువులని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం నారాయణపేటకు వచ్చిన ఆమె, తనకు ధన్వాడ జెడ్పీ స్కూల్‌లో విద్యాబుద్ధులు నేర్పిన చిన్ననాటి గురువు జి.కురుమన్నను కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పాదనమస్కారం చేశారు. మిఠాయిలు తినిపించి తాను పార్లమెంట్ వరకు వెళ్లడానికి అక్షరజ్ఞానం అందించిన మీ ఆశీర్వాదం ఎంతో గొప్పదని, ఎప్పటికీ మీ రుణం తీర్చుకోలేనని అన్నారు. తన చిన్ననాటి రోజుల్లో పాఠాలు బోధించిన పలువురు ఉపాధ్యాయులను గుర్తుచేసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రతంగపాండురెడ్డి, పి.శ్రీనివాసులు, సత్యాయాదవ్, రఘువీర్‌యాదవ్, అయ్యప్ప, రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

- 2గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా


ఒరిగిన ఇనుప విద్యుత్ స్తంభం

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని వేగంగా వచ్చిన ఓ కారు ఆదివారం సాయంత్రం ఢీ కొట్టింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి కారు వెనక్కి తిరగడంతో అటు నుంచి వస్తున్న బైక్ కారును ఢీ కొట్టింది. దీంతో కారు, బైక్ దెబ్బతిన్నప్పటికీ ఎవరికి గాయాలు కాలేదు. ఇనుప స్తంభం కింద పడిపోవడంతో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పక్కనే ఉన్న మరో స్తంభానికి విద్యుత్ కనెక్షన్ కలిపేందుకు సుమారు రెండు గంటల పాటు శ్రమించడంతో సరఫరా పునరుద్ధరణ అయ్యింది. ఇదే దారిలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభానికి కనెక్షన్ ఇవ్వకుండా విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడం, రోడ్డు మధ్యలో ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించకపోవడం వల్లే పెను ప్రమాదం తప్పిందని స్థానిక ప్రజలు చర్చించుకున్నారు. ఈ ఘటనతో కర్నూల్ రోడ్డు, బసవన్న గడ్డ, కేడీఆర్ నగర్, అయిజయ్య కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, బంగార్ నగర్, వల్లభ్‌నగర్, బస్టాండ్‌రూట్, పొట్టి శ్రీరాములు చౌరస్తా, రాజీవ్ చౌక్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


జూరాల ప్రాజెక్టు వద్ద పర్యాటకుల రద్దీ


బీచుపల్లి పుష్కరఘాట్ వద్ద యువకుల సందడి

సందర్శకుల సందడి

- జూరాలకు పోటెత్తిన పర్యాటకులు
- ప్రాజెక్టు రహదారిపై భారీగా ట్రాఫిక్‌జాం

ధరూరు/అమరచింత/ఎర్రవల్లి చౌరస్తా: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సందర్శకులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజు కావడంతో కృష్ణమ్మ అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాజెక్టు వద్ద సందడి చేశారు. చిన్నారులు, యువకులు ఫొటోలు తీసుకుంటూ బిజీగా గడిపారు. ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు ఉరకలెత్తుతున్న కృష్ణమ్మ పరవళ్లను చూసి పరవశించిపోయారు. ప్రాజెక్టు దిగువకు వెళ్లడానికి వీలులేకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎడమ కాల్వ సమీపంలో చేపల వంటకాల ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది.

⇨ పర్యాటకులు ప్రాజెక్టు రహదారిపైనే తమ వాహనాలను నిలిపివేసి చేపల వంటకాల ప్రదేశానికి వెళ్లడంతో భారీగా ట్రాఫిక్‌జాం అయ్యింది. రెండు గంటలపాటు ఎడమ కాల్వ వద్ద వాహనాల రద్దీ తగ్గకపోవడంతో సీఐ శివకుమార్, ఎస్ఐ సురేష్‌కుమార్‌లు ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు ప్రాజెక్టును సందర్శించి, సీఐ శివకుమార్‌తో వివరాలు తెలుసుకున్నారు. జూరాల ప్రాజెక్టుకు వరదలు వచ్చినప్పుడల్లా ఎడమ కాల్వ వద్ద ట్రాఫిక్‌జాం అవుతుందని.. సంబంధిత అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టడంలేదని పర్యాటకులు ఆవేదన వ్యక్తంచేశారు. జూరాల వద్ద వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.


చేప వంటకాల వద్ద కిక్కిరిసిన సందర్శకులు

⇨ బీచుపల్లి కృష్ణానది పుష్కరఘాట్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. నిండకుండలా ప్రవహిస్తున్న కృష్ణమ్మను తిలకిస్తూ ఉల్లాసంగా గడిపారు. పుష్కరఘాట్ వద్ద చిన్నారులు, యువకులు ఆహ్లాదంగా చిందులేస్తూ సెల్ఫీలు దిగారు. కృష్ణానదికి వరద అధికం కావడంతో ఘాట్ వద్ద అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

మానవ మనుగడకు గురుబలం తప్పనిసరి


మహా పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజి

నాగర్‌కర్నూల్: మానవ జన్మకుండలికి సంబంధించి నవ గ్రహాల్లో గురుబలం, గురు శుభ స్థానం ఉచ్ఛ స్థితిలో ఉన్నట్లయితే మానవ జీవిత పోకడ విశేషంగా కొనసాగుతుందని శ్రీజగద్గురు పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజి అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామీజి మాట్లాడుతూ.. హోమాల వల్ల దీర్ఘకాలిక సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. హోమ యాగలతో ఆధ్యాత్మికతతో పాటు విశేషమైన ఆక్సిజన్ కలిగి ఉంటుందన్నారు. సాయంత్రం శ్రీరాధా గోవిందా పట్టాభిషేక కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈనెల 7 నుంచి 800 మంది బ్రాహ్మణులచే ప్రత్యేకంగా చేపట్టిన యాగం, పూజలకు సంపూర్ణ ఫలితం పొందుటకు మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజిని యాగమండపం నుంచి యాగశాల వరకు పల్లకీలో ఊరేగించారు.

యానగుంది క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలు


సూర్యనంది క్షేత్రంలో హోమం

దామరగిద్ద: మండల సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం యానగుంది సూర్యనంది క్షేత్రంలో వెలిసిన మాణికేశ్వరి మాత ఆలయంలో గురుపూజోత్సవ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం క్షేత్రంలోని మాణికేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు, పాదుక పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. భక్తుల పంచాక్షరి మంత్రంతో ఆలయం మారుమోగింది. కార్యక్రమంలో యానగుంది ట్రస్ట్ కార్యదర్శి శివయ్యస్వామి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.